

మొదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం

ప్రతినెలా ప్రత్యేక దర్శనం తిరిగి ప్రారంభించాలని టీటీడీ నిర్ణయం ● వివరాలు వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి, తిరుమల స్థానికులకు గతంలో ప్రతినెలా మొదటి మంగళవారం ప్రత్యేకంగా దర్శనం అవకాశం ఉండేది. ఆ తర్వాత రద్దు చేసిన ఈ విధానాన్ని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించాం' అని టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి తొలిసమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆ నిర్ణయాలివీ..

● తిరుపతిలో గరుడ వారధిని గతంలో సీఎం చంద్రబాబు హయాంలో పనులు ప్రారంభించారు. దాని పేరును గత ప్రభుత్వం శ్రీనివాససేతుగా మార్చింది. ఈక్రమంలో తిరిగి పాతపేరు గరుడవారధిగానే ఉంచాలని బోర్డు తీర్మానించింది.

● గతంలో అలిపిరిలోని 20 ఎకరాలను టూరిజంకు కేటాయించారు. అక్కడ దేవలోకం అనే ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కానీ ఆ స్థలం కొన్ని చేతులు మారి ముంతాజ్ అనే ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించేందుకు ప్రయత్నాలు జరిగాయి. స్వామి కొండలకు దగ్గరగా ఉన్న ఆ ప్రాంతంలో హోటల్ నిర్మాణం జరిగితే హిందువుల మనోభావాలు దెబ్బతింటాయి. అందుకని ఆ స్థలాన్ని టీటీడీకి అప్పగించాలని ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు.

● బ్రహ్మోత్సవాల్లో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు గతేడాది ఇచ్చిన బ్రహ్మోత్సవ బహుమానాన్ని 10 శాతం పెంచాలని నిర్ణయించారు. దీంతో శాశ్వత ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7,535 బ్రహ్మోత్సవ బహుమానం అందనుంది.

● వివిధ రాష్ట్రాలకు ఇస్తున్న టూరిజం టికెట్లలో అక్రమాలు జరిగాయని విజిలెన్స్ విచారణలో కూడా తేలింది. ఈ క్రమంలో కోటా మొత్తాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తిరుమల పిల్‌గ్రీం సెంటర్ అని, టూరిజం సెంటర్ కాదని పేర్కొన్నారు.

● విమానాశ్రయంలో జారీ చేసే శ్రీవాణి టిక్కెట్ల కోటాను వంద నుంచి 200కు పెంచుతూ తీర్మానించారు.

● నెయ్యి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించేందుకు తిరుమలలో రూ.90 లక్షలతో నూతన ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఓ ప్రశ్నకు చైర్మన్ బీఆర్ నాయుడు బదులిచ్చారు. తిరుమలలో అన్యమత ప్రచారం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, సభ్యులు

● వీఐపీ బ్రేక్ దర్శనాల సమయాన్ని తగ్గించడం, సమయం మార్పు అంశంపైనా పరిశీలిస్తామన్నారు. ఆలిండియా రేడియోలో శ్రీవారి ఆర్జితసేవల ప్రసారాలను తిరిగి ప్రారంభించే విషయాన్ని అధికారులతో చర్చిస్తామన్నారు.

● ఏఐ టెక్నాలజీ ఉపయోగించి భక్తులకు దర్శన సమయాన్ని తగ్గించేందుకు కొన్ని సంస్థలతో మాట్లాడుతున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వివరించారు. రానున్న 25 ఏళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నప్రసాద భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. దీని కోసం టీవీఎస్ అనే సంస్థ ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. వడ్డించడం నుంచి పరిశుభ్రత, స్టోర్ వంటి అన్నింట్లో మార్పులు చేస్తామన్నారు.

ఆ మఠాలపై చర్యలు తీసుకోండి : కిరణ్

తిరుమలలో భక్తులను దోపిడీ చేస్తున్న మఠాలపై చర్యలు తీసుకోవాలంటూ తిరుపతి జనసేన పార్టీ నేత కిరణ్‌రాయల్ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి వినతిపత్రాన్ని అందజేశారు. తిరుమలలోని 60 శాతం మఠాలు వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లడంతో, వారు సిండికేట్‌గా మారి భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. మఠాలను ఫైవ్‌స్టార్ హోటళ్లుగా మార్చి లక్షలాది రూపాయాలు దోచుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో సామాన్య భక్తులు తిరుమలలో వివాహాలు చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కొందరు స్వామీజీల అక్రమ కట్టడాలనూ కూల్చేయాలని చైర్మన్‌ను కోరినట్టు తెలిపారు. టూరిజం పేరుతో శ్రీవారి దర్శనాల్లో అక్రమాలు జరుగుతున్నట్టు గతంలో కిరణ్‌రాయల్ వెలుగులోకి తీసుకొచ్చారు. ఈక్రమంలో టూరిజం టికెట్ల కోటాను రద్దు చేస్తూ తీర్మానించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పాపం పురుషుడు!

● పెరుగుతున్న బలవన్మరణాలు

నేడు ప్రపంచ పురుషుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం 8వ పేజీలో

సత్యాత్మతీర్థ స్వామికి తిరుమలలో పెద్దమర్యాద

తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది మఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ సోమవారం టీటీడీ పెద్ద మర్యాదతో శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో అఖిలాండం వద్దకు చేరుకున్న స్వామిజీకి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం శఠగోపాన్ని అందించి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. శిష్య బృందంతో కలిసి ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు.



అఖిలాండం వద్ద సత్యాత్మతీర్థ స్వామికి శఠగోపంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని సదరన్ డిస్కం ఎస్ఈ ఎ.శ్రీనివాస బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సదరన్ డిస్కం పరిధిలో విద్యుత్ చౌర్యం జరుగుతోందని వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటి సర్వీసుల రూపంలో కనెక్షన్ తీసుకుని ఇతర సేవలకు వినియోగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. సర్వీసు తీసుకునే సమయంలో అంగీకరించిన నిబంధనలు ఉల్లంఘించరాదని పేర్కొన్నారు.

నేటి నుంచి సీపీటీ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఏపీపీఎస్సీ కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు (సీపీటీ) పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. సీపీటీ పరీక్షలపై కలెక్టరేట్‌లో ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. పుత్తూరులోని వెంకటేశ పెరుమాల్ కాలేజ్‌లో పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. జిల్లా నుంచి 677మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. సమావేశంలో సంబంధిత అధికారులు సురేష్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం శనివారం నాడు రూ.3.87 కోట్లు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆదివారం పరకామణి లెక్కింపులో లెక్కించారు. ఇక, ఆదివారం 71,441 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 23,595 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ఖేల్ ప్రోత్సాహ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత ధ్యాన్‌చంద్, ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్యలతో పాటు రాష్ట్ర ఖేల్ ప్రోత్సాహ అవార్డులను ప్రకటించారని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9542034270ను సంప్రదించాలని కోరారు.

బదిలీ చేసినా రిలీవ్ కాలేదు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో నూతనంగా ఏర్పడిన చిత్తూరు, అన్నమయ్య జిల్లా కేంద్ర సర్కిల్ కార్యాలయాలకు బదిలీ చేసిన ఉద్యోగులు గడువు ముగిసింది. అయినా, సోమవారం వరకు రిలీవ్ కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతన జిల్లాల వారీగా విద్యుత్ సర్కిల్ కేంద్రాలు ఏర్పాటు చేసి, గతనెల 22వ తేదీ నూతన సర్కిళ్లను ఏర్పాటు చేయడానికి కార్యాలయ కేంద్రాలు గుర్తించి ఉద్యోగుల బదిలీలు ప్రారంభించారు. బదిలీ చేసిన ఉద్యోగులు ఈనెల 15లోపు రిలీవ్ కావాలని ఆదేశించారు. కానీ, ఏఈ నుంచి జేఎల్ఎం వరకు కొందరు ఉద్యోగులు రిలీవ్ కాలేదు. జిల్లా స్థాయి అధికారి అండదండలతో ఇక్కడే ఉండే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, కొత్త సర్కిళ్ల కార్యాలయాల్లో నవంబరు ఒకటి నుంచే విధులు నిర్వర్తించాల్సి ఉన్నా, ఇంకా వీరు డ్యూటీల్లో చేరకపోవడం గమనార్హం.

నారావారిపల్లె నుంచి సీఎం తిరుగు పయనం

● చంద్రబాబును కలిసిన సన్నిహిత బంధువులు, జిల్లా నేతలు



నారావారిపల్లె నుంచి తిరుగు ప్రయాణమైన సీఎం చంద్రబాబు

తిరుపతి/చంద్రగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో ఆదివారం తన తమ్ముడు రామ్మూర్తినాయుడి అంత్యక్రియల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు.. సోమవారం స్వగృహంలో తలుగు పెట్టారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మరోసారి సోదరుడి చితి స్థలం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అనారోగ్యంతో మృతి చెందిన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు స్వగ్రామం వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం సాయంత్రం లోకేశ్ సతీమణి బ్రాహ్మణి హైదరాబాదు వెళ్లగా.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, భువనేశ్వరి, దేవాన్ష్ మాత్రం గ్రామంలోనే రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబును గ్రామంలోని సన్నిహిత బంధువులు, జిల్లా టీడీపీ నేతలు, అధికారులు కలిశారు. సోమవారం ఇంట్లో రామ్మూర్తి నాయుడికి తలుగు (బట్టలు, సాంబ్రాణి పెట్టి పూజించడం) పెట్టారు. అనంతరం సన్నిహిత బంధువులు వీరిని కలిశారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, శాప్ చైర్మన్ రవి నాయుడు, తిరుపతి, చిత్తూరు టీడీపీ పార్లమెంటు కమిటీల అధ్యక్షులు నరసింహ యాదవ్, సీఆర్ రాజన్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, పార్టీ నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, నరసింహ ప్రసాద్, పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కమిషనర్ మౌర్య, ఆర్డీవో రామ్మోహన్ తదితరులు చంద్రబాబు, లోకేశ్‌ను కలిశారు. నేతలతో కలిసి మధ్యాహ్నం చంద్రబాబు భోజనం చేశారు.

తమ్ముడికి నివాళులర్పించి..

మధ్యాహ్న భోజనానంతరం లోకేశ్ తనయుడు దేవాన్ష్ హైదరాబాదు బయల్దేరి వెళ్లగా 3.20 గంటలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ విజయవాడ బయల్దేరారు. మంత్రి లోకేశ్ తన కాన్వాయ్‌తో నేరుగా విమానాశ్రయం వెళ్లగా.. సీఎం చంద్రబాబు మాత్రం తమ మామిడి తోట వద్ద వాహనం ఆపించి కిందకు దిగారు. తోటలోకి వెళ్ళి తమ్ముడి దహన క్రియలు జరిగిన ప్రదేశం వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. అనంతరం వెనుదిరిగి విమానాశ్రయం బయల్దేరారు. సాయంత్రం 4 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచీ ప్రత్యేక విమానంలో మంత్రి లోకేశ్‌తో కలసి విజయవాడ బయల్దేరి వెళ్ళారు. వారికి కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ షిమోషీ బాజ్‌పాయ్, మాజీ మంత్రి అమరనాధరెడ్డి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేత కొల్లూరు ఇందుశేఖర్ తదితరులు వీడ్కోలు పలికారు.



మంత్రి లోకేశ్‌తో టీడీపీ నేతలు

28న కర్మక్రియలు.. హాజరు కానున్న సీఎం

రామ్మూర్తినాయుడి కర్మక్రియలు ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఉదయం వచ్చి కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం తిరిగి విజయవాడ వెళ్ళనున్నారు. కర్మక్రియల ఏర్పాట్లకు సంబంధించి ఆ రోజున భోజనాలు ఏర్పాటు చేయడానికి, వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ, ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రామ్మూర్తినాయుడు కుటుంబీకులతో కలసి ఈనెల 28వ తేదీ వరకు నారావారిపల్లిలోనే ఉండనున్నారు.



కర్మక్రియలకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని, అధికారులు

సీఎం ఇంటి ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

సోమవారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబును కలిసేందుకు తిరుపతి పద్మావతి వర్సిటీ సమీపంలోని గాంధీనగర్ నుంచి యశోద నారావారిపల్లికి వచ్చారు. చాలాసేపు సీఎం నివాసం ఎదుట నిరీక్షించారు. పోలీసులు అనుమతించకపోవడంతో బలవంతంగా లోపలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆమె చేతికున్న గాజులు పగులగొట్టుకుని ఆ ముక్కలు, పొడి మింగి ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు అడ్డుకుని ఆమెను అదుపులోకి తీసుకుని చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు తరలించి.. అనంతరం విడిచిపెట్టారు. ఈ ఘటనను ఫొటోలు, వీడియోలు తీయడానికి యత్నించిన మీడియా ప్రతినిధుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారు. ఆంధ్రజ్యోతి విలేకరి నుంచీ మొబైల్ ఫోన్ గుంజుకున్నారు.



మహిళ నోట్లో నుంచి గాజులు తీస్తున్న పోలీసులు

తిరుపతిలో కార్తీక దీపోత్సవం



తిరుపతి(కల్చరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో సోమవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి మాట్లాడుతూ.. కార్తీక మాసంలో దైవ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల అధిక ఫలం పొందవచ్చన్నారు. మనలోని అంధకారాన్ని దీపం పోగొడుతుందన్నారు. శివకేశవుల వైశిష్ట్యం, దీపం ప్రాముఖ్యత, దీపారాధనతో కలిగే ప్రయోజనాన్ని వివరించారు. ప్రజల హృదయాలలో జ్ఞానజ్యోతులు వెలిగించాలని వేంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎస్వీ వేదవిశ్వవిద్యాలయం వేద పండితులు యతివందనం, వేద స్వస్తి నిర్వహించారు. వివిధ పూజల అనంతరం ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు నృత్య రూపకం ప్రదర్శించారు. చివరగా అన్నమాచార్య ప్రాజక్టు కళాకారులు అన్నమయ్య గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో జె.శ్యామల రావు, వేద వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి, బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, భానుప్రకాష్ రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, డీఎల్వో వరప్రసాదరావు, తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణ శేషాచల దీక్షితులు, అర్చక బృందం, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సిద్ధేశ్వరానందభారతి



జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతల స్వీకారం


న్యాయవాదుల సమావేశంలో జడ్జి పూర్ణిమాదేవి

పాకాల, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా పూర్ణిమదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కందుకూరు నుంచి ఆమె పాకాల కోర్టుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక న్యాయవాదులతో సమావేశమై మాట్లాడారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బిసి.రెడ్డప్పనాయుడు, కార్యదర్శి గౌరీశంకరరాజు, న్యాయవాదులు జిగురుస్వామి నాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఎస్ఎం. సలీం, చంద్రమోహన్, ప్రవీణ్ ప్రకాష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి

పాకాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలలోని మహిళలు బ్యాంకు రుణాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి సూచించారు. స్థానిక మండల వెలుగు సోమవారం ఏపీఎం సీసీల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆసరాగా నిలవాలన్నారు.

శ్రీవారికి వెండి పూజా సామగ్రి విరాళం


వెండి పూజాసామగ్రితో ఎంజీ రెడ్డి

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి సోమవారం వెండి పూజాసామగ్రి విరాళంగా అందింది. సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం కనసానివారి పల్లెకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీరెడ్డి రూ.7 లక్షల విలువైన వెండి బిందె, దీపస్తంభాలు, ప్లేట్ వంటి పూజా సామగ్రిని సోమవారం అర్చకులు, అధికారులకు అందజేశారు. వీటి బరువు 6.7 కేజీలని దాత తెలిపారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం


హోమంలో పాల్గొన్న టీడీపీ నేత లంకెళ్ళ లలితకుమారి

చంద్రగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె పంచాయతీ నూలివెంకన్న కొత్తపల్లిలో ముత్యాలమ్మ ఆలయ తొమ్మిదోవ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్య కలశారాధన, గణపతి, నవగ్రహ హోమాలు, లలిత సహస్రనామ, శ్రీసూక్త, నవదుర్గ హోమాలు, మహాపూర్ణాహుతి, అనంతరం ముత్యాలమ్మ మూలమూర్తికి పంచామృతాభిషేకం చేశారు. 108 బిందెలతో స్నపన అభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రాకారోత్సవం నిర్వహించారు. చిత్తూరు పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు లంకెళ్ళ లలితకుమారి అమ్మవారికి సారె సమర్పించారు. మాజీ జడ్పీటీసీ సరితా రమణమూర్తి, ఎంపీటీసీ ఏసీ శేఖర్, ఆలయ అధ్యక్షుడు నూలి వెంకన్ననాయుడు, శెన్నంశెట్టి సుబ్రమణ్యం, గంధం సుబ్రమణ్యం, తొగురు సుబ్రమణ్యం, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

తలకోన నీటి సాధన కమిటీ కార్యదర్శిగా సహదేవయ్య



భాకరాపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తలకోన నీటి సాధన కమిటీ కార్యదర్శిగా చిన్నగొట్టిగల్లు మండలం, చట్టేవారిపాలెం పంచాయతీకి చెందిన రాయి సహదేవయ్యను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తలకోన నుండి వృధాగా పోతున్న నీటిని చెరువులకు మళ్ళించడం ద్వారా కరువు రహిత ప్రాంతంగా చేయడానికి కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి


కృష్ణమూర్తినాయుడు

రామచంద్రాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని ఎస్వీ గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఫార్మసీ హెడ్ డాక్టర్ బి.కృష్ణమూర్తినాయుడు సూచించారు. సోమవారం వెంకట్రామపురంలో ని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా ప్రొఫెషనల్ లెర్నింగ్ అడ్వాన్స్‌డ్ అనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, విభాగాధిపతులు, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దెకు ఇస్తే కబ్జాయత్నాలు: స్థల యజమాని

తిరుపతిరూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీలో సర్వేనంబరు15లోని తమస్థలంలో(షెడ్) అద్దెకు చేరిన యశోద కబ్జాకు ప్రయత్నిస్తున్నారని యజమాని డి.రాజేశ్వరరావు ఆరోపించారు. ఈస్థలాన్ని 2016లో తాము రిజిస్ట్రేషన్ చేసుకుని షెడ్లు నిర్మించి యశోదకు అద్దెకి ఇచ్చామన్నారు. అద్దె సక్రమంగా చెల్లించకపోగా అగ్రిమెంటు కాలపరిమితి పూర్తయినా ఖాళీ చేయలేదన్నారు. స్థలం తనకే విక్రయించాలని బెదిరిస్తున్నారన్నారు. కొందరు వత్తాసు పలుకుతుండడంతో ఆమె తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. స్థలంపై కోర్టులో ఎలాంటి స్టేఆర్డర్లు_గానీ నోటీసులు లేవని రాజేశ్వరరావు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

ఉపాధి నిధుల వినియోగంపై గ్రామసభ


మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యంరెడ్డి, పక్కన సర్పంచ్ తదితరులు

తిరుపతి రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మ ల్లగుంటగ్రామపంచాయతీలోని స చివాలయంలో సోమవారం సర్పంచ్ టి.జానకమ్మ అధ్యక్షతన ఉపాధి హామీపథక నిధుల వినియోగంపై గ్రామసభ నిర్వహించారు. 2023-24లో చేపట్టిన పనులపై సామాజిక సర్వే చేపట్టారు. సోషల్ ఆడిట్ అధికారి కూలీలతో మాట్లాడి వివరాలు నమోదు చేశారని పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. పేరూరు చెరువు, పంచాయతీలో హౌసింగ్‌లో పనులు చేపట్టామన్నారు. ఎంపీటీసీ డి.విజయలక్ష్మి, ఉపసర్పంచ్ జయచంద్రారెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

సీఎంకు సాదర వీడ్కోలు


తిరుపతి విమానాశ్రయంలో సోమవారం చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నేత ఇందుశేఖర్

అందుబాటులోకి స్విమ్స్ కార్డియాలజి అరిథ్మియా క్లినిక్

తిరుపతి(వైద్యం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ కార్డియాలజీ విభాగంలో అరిథ్మియా క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రామ్ తెలిపారు. గుండె వ్యాధిగ్రస్తులకు ఈ క్లినిక్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. సింకోపి, బ్రాడీకార్డియ, టాచీ కార్డియా (గుండె వేగంగా కొట్టుకోవడం) వంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఈ క్లినిక్‌లో చికిత్సలను అందిస్తారని వెల్లడించారు. తిరుపతి నగరంలో 3డి ఎలక్ట్రోఫిజియాలజీ సిస్టమ్ కలిగిన ఏకైక హాస్పిటల్‌గా స్విమ్స్ నిలుస్తోందని, కచ్చితత్వంతో అధునాతన వైద్య సేవలను రోగులకు అందించగలమని తెలిపారు.

చంద్రగిరి

శ్రీవారిసేవలో ప్రముఖులు


అజయ్‌కుమార్

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్, వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

వృద్ధురాలిపై స్ప్రే కొట్టి బంగారు గొలుసు చోరీ

పాకాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా వున్న ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరించిందో మహిళ. పాకాల భారతంమిట్ట ఆరవ వీధిలో ఇంట్లో ఒంటరిగా వున్న కాంతమ్మ (80) ఇంట్లోకి సోమవారం ముఖానికి ముసుగు వేసుకొని ఓ గుర్తు తెలియని మహిళ చొరబడింది. వృద్ధురాలి ముఖంపై స్ప్రే కొట్టి మెడలోని 22 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని పారిపోయింది. వృద్ధురాలి అరుపులు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ సర్వీసు పొడిగింపు

తిరుపతి అర్బన్, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా రమణప్రసాద్‌కు మరో ఏడాది కాలం సర్వీసు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతనెల 13న ఆయనకు రెండేళ్ల పదవీకాలం పూర్తయింది. 2015 అక్టోబరు 13వ తేదీ వరకు యథాస్థానంలో కొనసాగాలని ఆదేశించింది. ఆయన జిల్లా పర్యాటకాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

కారు ఢీకొని మహిళకు గాయాలు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. మండలంలోని రాజులపాళెం వద్ద నడిచి వెళుతున్న మహిళను శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుశీలమ్మకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం ఏర్పేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.

గ్రావెల్ టిప్పర్ల స్వాధీనం

సత్యవేడు, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): మండలంలో అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఆరు టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. స్థానిక వీఆర్‌కండ్రిగ సమీపంలోని ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు వీఆర్‌వో వినోద్, ఆర్ఐ సురేష్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని గుర్తించి సంబంధిత టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యోగ మేళాలో 26మంది ఎంపిక

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ, సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పలు బహుళ జాతి పరిశ్రమ నిర్వాహకులు ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 26మంది ఎంపిక కాగా 14మంది మహిళా డిగ్రీ కళాశాల నుంచి, 12మంది వివిధ కళాశాలల నుంచి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. జేకేసీ కోఆర్డినేటర్ ఉషారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో కార్తీక దీపోత్సవం

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆల యంలో సోమవారం కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల అభిషేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి, వేదపండితులు పవన్ శర్మ, వంశీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

● నాగలాపురం: మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వ రాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరుస చోరీలతో ప్రజలు బెంబేలు

● అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు


చోరీ జరిగిన ఏటీఎంను పరిశీలిస్తున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో వరస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మూడు రోజుల కిందట పట్టణంలో ఓ ఉపాధ్యాయుడు ఇంట్లో బంగారంతో పాటు వెండి చోరీ చేశారు. ఐతేపల్లెలోని ఓదుకాణంలో చొరబడి నగదు దోచుకెళ్లారు. చంద్రగిరి బైపాస్ బ్రిడ్జి వద్ద ఎరువుల దుకాణంలో కూడా చోరీ జరిగింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్థుల ఇళ్ళనే దుండగలు టార్గెట్ చేసుకుంటున్నారు. మండలంలో రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తున్నా చోరీ జరుగుతుండటంతో పోలీసులకు సవాలుగా పరిణమించింది. దొంగతనాలు జరగక ముందే అప్రమత్తంగా ఉంటే చోరీలను నియంత్రిచవచ్చునని పోలీసులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మండలంలో చోరీల నియంత్రణకు అవగాహన కల్పిస్తున్నారు. తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. సీసీ కెమెరాలతో దుండగులను సులభతరంగా పట్టుకోవచ్చునంటున్నారు. ఇటీవల ఏటీఎం చోరీలో నిందితులను సీసీ కెమెరాల సాయంతోనే పట్టుకున్నారు.

కెమెరాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఊరెళ్తున్నప్పుడు ముందస్తుగా సమాచారమిస్తే ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. అక్కడ నుంచి ఎస్పీ కార్యాలయ కంట్రోల్ రూమ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. కెమెరాల దరఖాస్తుకు రుసుం చెల్లించక్కరలేదు. స్థానికంగా కూడా నిఘా పెడతాం. సిబ్బంది రాత్రి పూట ఆ ఇంటి వద్ద ప్రత్యేకంగా గస్తీ నిర్వహిస్తాం.
-సుబ్బరామిరెడ్డి, సీఐ, చంద్రగిరి.

ముక్కోటిలో శాస్త్రోక్తంగా రథోత్సవం


సాయంత్రం సప్తవర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

చంద్రగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తొండవాడలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శాస్త్రోక్తంగా రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్వామిఅమ్మవార్ల రథోత్సవాన్ని ఆలయ మాడవీధుల్లో నిర్వంచారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి కల్పతరువు వాహనంపై స్వామి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో కార్తీక మాసంలోని మూడవ సోమవారం సందర్భంగా ఉదయం స్వామివారు దానిమ్మ గింజల అలంకరణలో,

ఐదు గంటల్లో బాలిక ఆచూకీ లభ్యం


తల్లి చెంతకు చేరిన బాలిక

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి బస్టాండులో ఆదివారం అర్ధరాత్రి తల్లి నుంచి తప్పిపోయిన మూడేళ్ల బాలిక ఆచూకీని పోలీసులు ఐదు గంటల వ్యవధిలో ఛేదించారు. తిరుపతి ఈస్ట్ ఎస్ఐ నరసింహులు తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన మణికంఠ ఓ టింబర్ డిపోలో పని చేస్తున్నారు. ఇతడికి భార్య దేవి, మూడేళ్ల బాలిక వెన్నెల ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య ఘర్షణ జరడంతో చిన్నారిని తీసుకుని దేవి తిరుమల వెళ్లారు. అక్కడ 10 రోజుల పాటు ఉండి మళ్లీ ఆదివారం అర్ధరాత్రి తిరుపతికి వచ్చారు. ఆర్టీసీ బస్టాండులో తన కుమార్తెతో కలసి ఉండగా.. అర్ధరాత్రి దాటాక ఆమె నిద్రమత్తులోకి జారుకున్నారు. బాలిక మెల్లగా నడచుకుంటూ బస్టాండు బయటకు వెళ్లిపోయింది. తెల్లవారుజామున లేచి చూడగా బాలిక కనిపించకపోవడంతో అవుట్ పోస్టు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ నరసింహులు, స్టేషన్ రైటర్ పురుషోత్తం, సిబ్బంది ముమ్మరంగా గాలించారు. బాలిక ఏడుస్తూ బస్టాండు బయట తచ్చాడుతుండగా గుర్తించి తల్లికి అప్పగించారు.

పంటపొలాల్లో ఏనుగుల విధ్వంసం


పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

పాకాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దామలచెరువు పంచాయతీ మొరవపల్లె కాకర్లవారిపల్లె పరిసరాల్లో ఆదివారం రాత్రి ఏనుగులు పంటపొలాలపై దాడి చేశాయి. మామిడి, కొబ్బరి, అరటి, కాకర తోటల్లో విధ్వంసం సృష్టించాయి. మామిడి చెట్లు, కొబ్బరి సుడులను పేకేశాయి. అరటి దుంగలను పీకి తిని పంటలను తొక్కేశాయి. దీంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. ఏనుగులు వరుస దాడులు చేసి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులను అటవీ ప్రాంతాలకు తరలించి తమను రక్షించాలని, నష్టపోయిన పంటకు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు. సోమవారం ఉద్యాన అధికారి ఎస్.శైలజ ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. రైతులనడిగి నష్టపోయిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం తరువాత పొలాలవైపు ఒంటరిగా వెళ్లకూడదని ఆమె రైతులకు సూచించారు.

అమృత్ నిధుల మళ్లింపుపై బీజేపీ నిరసన


పురపాలకసంఘ ఆవరణలో నిరసనలో బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించడంపై బీజేపీ నాయకుడు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు పార్టీ నాయకులతో కలిసి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పురపాలకసంఘ కమిషనర్ గిరికుమార్‌ను కలిసి పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ కొందరు అధికారులు ఇంకా వైసీపీ ప్రభుత్వం ఉందనే ఆలోచనలో ఉన్నారన్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి అమృత్ పథకం అర్హత లేకున్నా అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు మంజూరు చేశారన్నారు. అందుకు సంబంధించిన వివరాలను తమకు రాత పూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విభజించి పాలించడం సరికాదు : చింతామోహన్

వరదయ్యపాళెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీలను విభజించి పాలించడం సరికాదని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. దళితులను విభజిస్తే చంద్రబాబు పతనం ప్రారంభమవుతుందన్నారు. దుగరాజ పట్నంపోర్టు, మన్నవరం పరిశ్రమలను ప్రారంభించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం వరదయ్యపాళెం మాజీ ఎంపీపీ విక్రమార్కరెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఆయనకు చింతామోహన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శివ, పురుషోత్తం పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్


నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

చంద్రగిరి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెం మండలం బోడెంవాండ్లపల్లెకు నుంచి చెంగాడివాండ్లపల్లి మార్గంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారంతో సోమవారం సీఐ పణీంద్ర, ఎస్ఐలు సుధాకర్, గిరి సిబ్బందితో దాడులు నిర్వహించారు. చెంగాడివాండ్లపల్లి క్రాస్ వద్ద మద్యం విక్రయిస్తున్న వెంకటరమణను అరెస్ట్ చేసి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి విద్యార్థులకు ఆధార్ క్యాంపులు

భాకరాపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. ఈనెల 19 నుంచి 22 వరకు చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులు తమ కార్డులో ఇంటిపేరు, పుట్టిన తేదీ వంటి మార్పులు చేసుకోనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆన్‌లైన్లో తీసుకున్న జనన ధ్రువీకరణ పత్రాన్ని తప్పకుండా తీసుకురావాలన్నారు.

వృద్ధాశ్రమంలో స్వెట్టర్ల పంపిణీ

భాకరాపేట, నవంబరు 18న(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లులోని రాస్ ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మండల జనసేన నాయకుడు రూపేష్‌కుమార్ సోమవారం స్వెటర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు చలికి ఇబ్బంది పడకూడదని తన వంతు సహకారం అందించారన్నారు.

గన్నవరానికి పయనమైన సీఎం



రేణిగుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సోదరుడి అంత్యక్రియలకు నారావారిపల్లెకు హాజరైన సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరానికి బయలుదేరి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం నారావారిపల్లి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న సీఎంకు శ్రీకాళహస్తి, చంద్రగిరి, పలమనేరు ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, నాని, అమరనాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ బాజ్‌పాయ్, జేసీ శుభం భన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు సాదర వీడ్కోలు పలికారు. అలాగే మంత్రి లోకేశ్ సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ మరో ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

కళత్తూరు భూముల్లో రీసర్వే

కేవీబీపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల కళత్తూరు దళిత రైతులకు, అటవీ శాఖ అధికారుల నడుమ భూ వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని సోమవారం రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. ప్రస్తుతానికి రోడ్డు పక్కనే ఉన్న భూములను రీసర్వే చేశారు. అటవీ భూములు తర్వాత సర్వే చేస్తామని సర్వేయర్ సురేష్ తెలిపారు. బీట్ ఆఫీసర్ లోకనాథం పాల్గొన్నారు.

టీటీడీ స్థానిక ఆలయాల క్యాలెండర్ల ఆవిష్కరణ

తిరుమల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): టీటీడీ స్థానిక ఆలయాల క్యాలెండర్లను సోమవారం టీటీడీ ఈవో శ్యామలరావుతో కలిసి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. తిరుమలలోని భూ వరాహస్వామి, తిరుపతి సమీపంలోని పేరూరు వకుళమాత ఆలయం, అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి, నాగలాపురం వేదనారాయణస్వామి, కార్వేటినగరం వేణుగోపాలస్వామి, ఒంటిమిట్ట కోదండరామస్వామి మూలమూర్తులు, ఉత్సవమూర్తులతో కూడిన క్యాలెండర్లను టీటీడీ ముద్రించింది. బుధవారం నుంచి ఇవి అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భరద్వాజ తీర్థంలో ఘనంగా లక్ష దీపోత్సవం




భరద్వాజతీర్థంలో పూజలు చేస్తున్న ఈవో తదితరులు - కార్తీక దీపాల వెలుగులో భరద్వాజతీర్థం

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ అధికారులు ముందుగా భర ద్వాజతీర్థం చుట్టూ క్రమపద్ధతితో నేతి దీపాలను అలంకరించారు. పుష్కరిణి ప్రాంగణంలో ముందుగా స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి విశేష పూజలు చేసి హారతులు సమర్పించారు. అనంతరం లక్ష దీపోత్సవాన్ని ఈవో బాపిరెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ యేడాది తొలిసారిగా లక్ష దీపోత్సవాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఈ విశేష వేడుకను మొదట నారద పుష్కరిణిలో నిర్వహించారు. రెండో వారం వైష్ణవ కోనేరులో కొనసాగించారు. మూడో వారం భరద్వాజతీర్థంలో చేపట్టారు. ఈ విశేష వేడుకను మహిళలు భక్తి శ్రద్ధలతో వీక్షించారు. నేతి దీపకాంతులతో పుష్కరణి తేజోమయంగా ప్రజ్వలించింది.

శ్మశాన వాటికల్లో సౌకర్యాల లేమి

● మౌలిక సదుపాయాలు లేక అంత్యక్రియలకు అవస్థలు



రాజీవ్‌గాంధీ కాలనీ సమీపంలో ఉన్న హిందూ శ్మశాన వాటిక - ముస్లిం శ్మశాన వాటికలో ఏపుగా పెరిగిన చెట్లు - (ఇన్‌సెట్‌లో) సమాధులపై మద్యం సీసాలు

తిరుపతి (జీవకోన), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవకోన శ్మశాన వాటికకు ఒక ప్రత్యేకత ఉంది. మతాలన్నీ ఒక్కటే అనే భావం వచ్చేలా ఇక్కడ హిందూ, ముస్లిం, క్రైస్తవులకు కలిపి ఒకేచోట శ్మశాన వాటికలు ఏర్పాటు చేశారు. అయితే మౌలిక సదుపాయాలు ఆస్థాయిలో లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. అంత్యక్రియల అనంతరం స్నానం చేయడానికి సరైన ఘట్టాలులేవు. పూజలు, ప్రార్థనల కోసం ప్రత్యేక చోటంటూ ఏర్పాటు చేయలేదు. తాగడానికి నీరు అందుబాటులో లేవు. వర్షం వచ్చినా, ఎండకైనా తల దాచుకోవడానికి కనీసం షెల్టర్లు లేవు. రోడ్లు సరిగా లేవు. ఎటుచూసినా ఏపుగా పెరిగిన చెట్లే కనిపిస్తాయి. విష పురుగుల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారింది. చెట్ల మధ్యనే మృతదేహాలను ఖననం, దహనం చేస్తున్నారు.

ఏర్పడినప్పటి నుంచి పట్టించుకునే వారేరి?

జీవకోన ప్రాంతం రాజీవ్‌నగర్ పంచాయతీలో ఉన్న సమయంలో అప్పటి పాలకవర్గం గెజిట్ పాస్ చేసి మతాలకతీతంగా మూడు శ్మశాన వాటికలను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. 2013 జూన్‌లో రాజీవ్‌నగర్ పంచాయతీ (ప్రస్తుత జీవకోన) తిరుపతి నగర కార్పొరేషన్‌లో విలీనమైంది. ప్రారంభం నుంచి నేటి వరకు కూడా శ్మశానం గురించి పట్టించుకున్న దాఖాల్లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

ఘనంగా కనకదాస జయంతి



కనకదాస చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం బీసీ సంక్షేమ శాఖ కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించారు. జేసీ శుభం బన్సల్ మాట్లాడుతూ కనకదాస భారతీయ తత్వవేత్త, గొప్ప భక్తుడు, సంగీతకారుడన్నారు. కన్నడ భాషలో సామాన్యులకు అర్థమయ్యే విధంగా కీర్తనలు రాశాడన్నారు. ఆయన సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 23వినతులు



వినతులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ వెంకట్రావు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం అదనపు ఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 23 వినతులు వచ్చాయి. అర్జీదారులను వేర్వేరుగా విచారించి, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఆర్థిక, భూ సమస్యలు, కుటుంబ తగాదాలు ఎక్కువగా రావడంతో, పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రయోగశాలల సామగ్రి వితరణ



ప్రయోగశాల సామగ్రిని వితరణ చేస్తున్న ఎడిఫై పాఠశాల యాజమాన్యం

తిరుపతి(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మంగళంలోని జిల్లా పరిషత్ ట్రెండ్స్ పాఠశాలకు తిరుచానూరు ఎడిఫైస్కూల్ స్టూడెంట్స్ కూడబెట్టిన నగదు, యాజమాన్యం వితరణతో దాదాపు రూ.2లక్షల విలువచేసే ప్రయోగశాల సామగ్రిని సోమవారం వితరణ చేశారు. హెచ్‌ఎం కేశవులనాయుడు మాట్లాడుతూ ఎడిఫై యాజమాన్యం గతంలో రెండుసార్లు ప్రయోగశాల సామగ్రిని వితరణ చేసిందని తెలిపారు. ఎడిఫై ప్రిన్సిపాల్ దేవరాజులు మాట్లాడుతూ ఈ సామగ్రిని వినియోగించుకుని త్వరలో రానున్న సైన్స్‌డేలో మంచి ప్రదర్శనలు ఇవ్వాలని సూచించారు. అకడమిక్ డీన్ జాహ్నవి, ట్రెండ్స్ ఉపాధ్యాయులు కృష్ణమనాయుడు, వసుంధర, శ్రీధర్, జీవరత్నం పాల్గొన్నారు.

మలబార్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన

తిరుపతి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో సరికొత్త వెండి ఆభరణాల ప్రదర్శన ప్రారంభించినట్లు షోరూం హెడ్ రిజీష్ తెలిపారు. ఇందులో భాగంగా వెండి సామగ్రి, పట్టీలపై 25శాతం రాయితీ, వెండి ఆభరణాల ఎమార్పీపై 10శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ అవకాశం ఈనెల 24వ తేదీ వరకే మాత్రమేనని తెలిపారు.

కరాటేలో తిరుపతి క్రీడాకారుల ప్రతిభ



కరాటేలో సత్తాచాటిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్‌లో తిరుపతి క్రీడాకారులు ప్రతిభచాటారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఏపీ స్పోర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పోటీలకు తిరుపతి నుంచి అండర్ 5-21మధ్య 30మంది బాలబాలికలు పాల్గొన్నారు. అత్యుత్తమంగా రాణించి 22మంది వివిధ పతకాలు సాధించారు. కటా విభాగంలో జోగేశ్వర్(అండర్ 5), ఎస్.కుప్పీ(అండర్ 6), బి.మిత్ర(అండర్ 10), కుమితే విభాగంలో నిత్యశ్రీ(అండర్ 7), బి.లిఖిత్‌కుమార్(అండర్ 11)లు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. మిగిలిన 17మంది సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. వారిని స్కేడాప్ ప్రెసిడెంట్ డాక్టర్ మిల్టన్‌శాస్త్రి, జనరల్ సెక్రటరీ, స్కేడాప్ టీమిండియా కోచ్ కీర్తన్‌లు అభినందించారు.

గిరిజన తాండాల్లో హథీరాం ఆలయాలు నిర్మించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న కమిటీ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజనతాండాల్లో హథీరాం ఆలయాలను నిర్మించాలని స్వామీ హథీరాం బావాజీ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి శివా నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారితో హథీరాం బావా పాచికలు ఆడినట్లు చరిత్ర చెబుతోందని, టీటీడీ సొంత నిధులతో తండాల్లో ఆయన ఆలయాలు నిర్మించాలని కోరారు. తమకు టీటీడీ పాలక మండలిలో సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. హథీరాం ఆస్తులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అపార్టుమెంటులో అగ్ని ప్రమాదం


- రూ.8 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన వస్తువులు

తిరుపతి,(నేరవిభాగం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలాజీ కాలనీలోని ఒక అపార్టుమెంటులో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి వివరాల మేరకు.. బాలాజీ కాలనీలోని మేఘన అపార్టుమెంటులో బసివిరెడ్డి కాపురముంటున్నారు. కుటుంబ సమేతంగా ఆయన బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఇంట్లో నుంచి పొగ వస్తుండడంతో అపార్టుమెంటులో కాపురమున్న వారు గుర్తించి వెంటనే స్థానిక అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఏసీ, డబుల్‌కాట్ బెడ్, వుడ్ ర్యాక్‌లు, ఇతర ఎలక్ట్రిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ.8లక్షల వరకు ఆస్తినష్టం వచ్చినట్లు బసివిరెడ్డి తెలిపారు.

వేడుకగా కార్తీక దీపోత్సవం



సాయి మందిరంలో దీపాల వరస

తిరుపతి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొంకావీధిలోని షిరిడీ సాయిబాబా మందిరంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపారాధన కావించారు. ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో షిరిడి సాయిబాబా సేవా సమాజ్ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, దుర్గం శ్రీనివాస్, మర్థం శివ, రమేష్, విజయలక్ష్మి, హరిబాబు, కళావతి పాల్గొన్నారు.

కపిలతీర్థంలో ముగిసిన చండీయాగం



చండీ యాగం నిర్వహిస్తున్న వేద పండితులు - దీపాలు వెలిగిస్తున్న మహిళలు

తిరుపతి(కల్చరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా కపిలతీర్థంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న చండీయాగం సోమవారం ముగిసింది. చివరి రోజు యాగశాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు చండీహోమం సమాప్తి, పూర్ణాహుతి కలశ ఉద్వాసన, మహాభిషేకం, అమ్మవారి మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6నుంచి 8 గంటల వరకు కపిలేశ్వరస్వామి కలశస్థాపన, పూజ, జపం, హోమం, నివేదన, హారతి నిర్వహించారు. డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు పాల్గొన్నారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది.

నేటి నుంచి రుద్రయాగం

కపిలతీర్థంలోని శివాలయంలో మంగళవారం నుంచి 29వ తేదీ వరకు రుద్రయాగం నిర్వహించనున్నారు. గృహస్తులు రూ.500 చెల్లించి ఒకరోజు హోమంలో పాల్గొనవచ్చు.

'తుడా' అవకాశమివ్వండి

- సీఎంను కోరిన మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



తిరుపతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఛైర్మన్‌గా తనకు అవకాశం ఇవ్వాలని టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సీఎం చంద్రబాబును కోరారు. విజయవాడకు తిరుగు ప్రయాణమైన చంద్రబాబును మంగళవారం తిరుపతి విమానాశ్రయంలో సుగుణమ్మ కలిశారు. ఆమె తుడాలో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగు న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్టు తెలిసింది. కాగా.. టీడీడీ పాలక మండలి నిర్ణయాలపై సుగుణమ్మ హర్షం వ్యక్తం చేశారు. స్థానికులకు శ్రీవారి దర్శనం, గరుడ వారధిగా పేరు మార్చడం శుభపరిణామమన్నారు. గరుడ వారధి పేరును గత వైసీపీ ప్రభుత్వం శ్రీనివాస సేతుగా మార్చినప్పుడు అనేక ఆందోళనలు చేశామని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గరుడ వారధిగానే మార్చుతామని ఎన్నికల ముందు చెప్పడం జరిగిందని గుర్తు చేశారు.

108 ఉద్యోగుల ఆందోళన

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని, 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని 108 సర్వీసెస్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. 108 వాహనాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మునిరాజా, రామకృష్ణ, మహేష్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టూరిజం, ఆర్టీసీలకు ప్రత్యేక దర్శనాల రద్దుపై హర్షం

తిరుపతి అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం, ఏపీఎస్, టీజీ ఆర్టీసీలకు కేటాయించే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాల కోటా రద్దు హర్షణీయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే సమయంలో స్థానికులకు శ్రీవారి దర్శనం పునరుద్ధరిస్తూ ధర్మకర్తల మండలి తీర్మానం చేయడం హర్షణీయమని తెలిపారు. గరుడవారధి పేరు పునరుద్ధరణ, శారదా పీఠానికి, ఒబరాయ్ హోటల్‌కు భూ కేటాయింపు రద్దు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవ బహుమానం పెంపుపై హర్షం

శ్రీవారి బ్రహ్మోత్సవ బహుమానం పెంపుపై టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు డైరెక్టర్, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2024 సంవత్సరానికి సంబంధించి శాశ్వత ఉద్యోగులకు రూ.14వేల నుంచి రూ. 15,400లకు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.7వేల నుంచి రూ.7,535కు పెంచుతూ సోమవారం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి, ఈవో శ్యామలరావుకు, అదనపు ఈవో వెంకయ్యచౌదరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

తిరుపతి వాసులకు శ్రీవారి దర్శనం శుభపరిణామం

తిరుపతి (జీవకోన), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రజలకు ఆధార్ కార్డు ద్వారా ప్రతినెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనాన్ని పునఃప్రారంభిస్తూ టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు మొదటి పాలక మండలి సమావేశంలో తీర్మానం చేయడం సంతోషకరమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా ఈ విషయమై చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఎన్డీయే కూటమి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం అభినందనీయమని తెలిపారు.

డిప్యూటీ స్పీకర్‌కు సన్మానం



రఘురామకృష్ణం రాజును సన్మానిస్తున్న రూపేష్ వర్మ

తిరుపతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును తెలుగు యువత తిరుపతి పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ రూపేష్ వర్మ ఘనంగా సన్మానించారు. సోమవారం విజయవాడలో డిప్యూటీ స్పీకర్‌ను కలిసి గజమాల, శాలువాతో సత్కరించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై మలేషియా వర్సిటీలో ప్రసంగం

- కటికిపల్లె వాసికి మంచి అవకాశం



ప్రసంగిస్తున్న డాక్టర్ సోమశేఖర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై మలేషియాలోని ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో ప్రసంగించే అవకాశం కటికిపల్లెకు చెందిన డాక్టర్ జె.సోమశేఖర్‌కు కల్గింది. ఆయన ప్రస్తుతం బెంగళూరులోని జైన్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాలపై ఇప్పటికే ఐదు దేశాల్లో 200కు చర్చల్లో పాల్గొన్నారు. ఈ గుర్తింపుతో మలేషియా యూనివర్సిటీ సోమశేఖర్‌ను ఆహ్వానించి కీలకోపన్యాసం ఇప్పించింది.

అలరించిన నాటికలు



కృష్ణపక్షం నాటికలో దృశ్యం

తిరుపతి(కల్చరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, రోటరీ క్లబ్ సౌజన్యంతో మహతి కళాక్షేత్రంలో జరుగుతున్న నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. తిరుపతికి చెందిన జే.రవీంద్ర సారథ్యంలో ప్రదర్శించిన కృష్ణపక్షం నాటిక ఆలోచింపజేసింది. రేణిగుంటకు చెందిన శ్రీవినాయక నాటక మండలి వారు ప్రదర్శించిన మైరావణ పౌరాణిక పద్య నాటకం ఆకట్టుకుంది. కళాకారులను నిర్వాహకుల తరఫున కప్పా పద్మనాభం, సామ్రాజ్యం దంపతులు, గుండాల గోపినాథరెడ్డి, కేఎస్ రాజు, సిద్ధేశ్వర శర్మ సత్కరించారు.

భక్త కనకదాసకు ఘన నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న కురబ సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరమభక్తుడైన భక్తకనకదాస 537వ జయంతి వేడుకలను తిరుమల, తిరుపతి కురుబ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఖాదీకాలనీ కూడలి వద్ద ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి, బైక్ ర్యాలీ ప్రారంభించారు. లీలామహల్, ఆర్టీసీ బస్టాండు, శిల్పారామం మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. సంఘం గౌరవాధ్యక్షుడు రెడ్డికుమార్‌గౌడ్ మాట్లాడుతూ కనకదాస కన్నడ, తెలుగు భాషల్లో అనేక పుస్తకాలు రచించారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు మంగిరి రెడ్డెప్ప, నగరాధ్యక్షుడు హరినాథ్, మల్లి, నాగసుబ్బయ్య, శంకరయ్య, ఆదినారాయణ, రఘురాం, రాజు, నరసింహులు, పోతయ్య, కురబ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శోభాయమానంగా కార్తీక దీపోత్సవం



కార్యక్రమంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని శ్రీవారి ఆలయంలో 50 వేల దీపాలతో చేపట్టిన కార్తీక దీపోత్సవం శోభాయమానంగా సాగింది. సోమవారం సాయంత్రం ఆలయం ముందు 50 వేల దీపాలు వెలిగించి భక్తులు తమలోని భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు కార్తీక దీపోత్సవంలో పాల్గొనడం ద్వారా జీవితంలో వెలుగును పొందాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం



ఉదయ్‌కుమార్, ప్రవీణ్ కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఉదయ్ కుమార్, ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎస్వీయూలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా తొలి మహాసభలో రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి నేతృత్వంలో 41 మందితో కార్యవర్గాన్ని నియమించారు. ఉపాధ్యక్షులుగా చంద్రనాయక్, మోహన్, వెన్నెల, సహాయ కార్యదర్శులుగా హరికృష్ణ, చందు, ఆనంద్, సూర్య, కోశాధికారిగా సతీష్‌ను ఎన్నుకున్నారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

శైవాలయాల్లో 'కార్తీక' సందడి



శ్రీకాళహస్తిలోని భరద్వాజతీర్థంలో కార్తీక దీపాల వెలుగులు.. దీపం వెలిగిస్తున్న ఈవో బాపిరెడ్డి

కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శైవ ఆలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం దీపాలు వెలిగించారు.





కపిలతీర్థంలో భక్తుల సందడి





నేడు ప్రపంచ పురుషుల దినోత్సవం



పాపం.. పురుషుడు!

పెరుగుతున్న బలవన్మరణాలు

"అమ్మ తొమ్మిది నెలలు మోస్తే నాన్న పాతికేళ్లు.. రెండూ సమానమే అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు. ఇంట్లో జీతం తీసుకోకుండా అమ్మ..తన జీతమంతా ఇంటికే ఖర్చుపెట్టే నాన్న .. ఇద్దరి శ్రమ సమానమే అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు.."


ఇటీవల సోషల్ మీడియాలో బాగా వైరల్ అయిన కవిత ఇది. చిన జీయర్ స్వామి సమక్షంలో రచయిత, సినీనటుడు తనికెళ్ల భరణి ఈ కవిత చదువుతూ భావోద్వేగాన్ని అదుపుచేసుకోలేకపోయారు. అందరూ అమ్మ గురించో లేదా మహిళల కష్టం గురించో మాట్లాడుతారు. బండెడు సంసార భారం మోస్తూ ఏనాడూ తన ఆరోగ్యం గురించి పట్టించుకోని నాన్నను విస్మరిస్తారు. కారణం అతడు పురుషుడు. సంసారనావ ఈదుతూ ఎదురయ్యే ఒత్తిళ్లు, ఆర్థిక సవాళ్లను మగవాళ్లు నిశ్శబ్దంగా భరిస్తున్నారు. ఒక్కోసారి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడుతుంటారు. సామాజిక, కుటుంబ, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యలను పరిష్కారాలుగా ఎంచుకుంటున్నారని జిల్లా గణాంకాలు చెబుతున్నాయి.

- తిరుపతి(ఆంధ్రజ్యోతి)

"పురుషుల మానసికారోగ్యం, ప్రాముఖ్యత గురించి చర్చ జరగాలనే ఆలోచనతో 'పాజిటివ్ మేల్ రోల్ మోడల్స్' అనే నినాదంతో నవంబరు 19ని ప్రపంచ పురుషుల దినోత్సవంగా గుర్తిస్తున్నారు. "

తిరుపతి జిల్లాలో పురుషుల ఆత్మహత్యల సంఖ్య మహిళలకంటే చాలా ఎక్కువగా ఉంది. ప్రతి 10 ఆత్మహత్యల్లో ఏడు లేదా ఎనిమిది మంది పురుషులే ఉన్నారు. గతేడాది 339 మంది ఆత్మహత్యలకు పాల్పడితే వారిలో 272 మంది పురుషులు ఉన్నారు. ఈఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకూ గణాంకాలు పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకున్న వారిలో మగవాళ్లు మహిళల కన్నా మూడు రెట్లు ఎక్కువ ఉన్నారు. గడిచిన 10 నెలల్లో 365 మంది ఆత్మహత్య చేసుకుంటే వీరిలో 283 మంది పురుషులే. ఆత్మహత్యకు భిన్నా కారణాలున్నా, ఒత్తిడికి గురవడం ప్రధానమని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. కుటుంబ సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల వల్ల కూడా కొందరు విషాదాంతమవుతున్నారు. ఒత్తిళ్ల తీవ్రత వల్లనే చాలామంది పురుషులు బీపీ, షుగర్‌ల బారిన పడుతున్నారు.

మద్యానికి బానిసలై



జిల్లాలో పది లక్షలమందికి పైగా పురుషులు ఉన్నారు. వీరిలో ప్రతి పదిమందిలో నలుగురు ఆల్కహాలును ఆశ్రయిసున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇందుకు కారణం ఒత్తిడి అని వీరు చెబుతుంటారు. జిల్లాలో నాలుగు డీ-అడిక్షన్ సెంటర్లు ఉన్నారు. ఇందులో ఒకటి రుయా ఆస్పత్రిలో నడుస్తోంది. మూడేళ్ల క్రితం తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో లక్ష్మీపురం వద్ద మరొకటి ఏర్పాటైంది. రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒకటి, పాపానాయుడు పేటలో మరొక డీ ఆడిక్షన్ సెంటర్ నడుస్తోంది. ఇక్కడ మద్యానికి బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

పురుషులే ఎందుకు?



శారీరకంగా పురుషుడు, స్త్రీకన్నా బలం కలిగినవాడు అనే వాదన వినిపిస్తుంటుంది. కార్మికుల వేతనాల్లోనూ ఈ తేడా చూపిస్తుంటారు. పిల్లల్ని కనే శక్తి ఉన్న స్త్రీలు సహజంగానే శారీరకంగా బలహీనం కావచ్చు గానీ, మానసికంగా మాత్రం పురుషులకన్నా బలమైనవారు. కుటుంబ, ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొనే స్థైర్యం మహిళల్లోనే ఎక్కువ. పిల్లలు, కుటుంబం అనే బాధ్యత కూడా వీరికి పోరాడే తెగువను ఇస్తుంది. మగవాళ్లు చావును ఎంచుకుని తేలిగ్గా ఈ బాధ్యతల నుంచి పారిపోయే ప్రయత్నం చేస్తారు. అందుకే ఆనారోగ్యంతోనే, అప్పులతోనే ఆత్మహత్యలకు పాల్పడ్డారంటూ పురుషుల గురించే ఎక్కువగా వింటుంటాం.

పురుషులు బయటకు చెప్పుకోలేరు



రకరకాల ఒత్తిళ్ల వల్ల పురుషులు మానసికంగా అంతకంతకూ బలహీనులవుతున్నారు. అందుకే మహిళల కన్నా పురుషుల్లోనే ఆత్మహత్యలు మూడు రెట్లు ఎక్కువ కనిపిస్తున్నాయి. మానసిక బలహీనతలతో పాటు బీపీ, డయాబెటిస్, గుండె జబ్బులు తదితర ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. పురుషులు ఒత్తిడిని బయటకు చెప్పుకోలేరు. మనసులోనే దాచుకుని నలిగిపోతుంటారు. ఆడవాళ్లతో పోలిస్తే మగాళ్లకే గుండెపోటు ఎక్కువగా వస్తుందని పలు పరిశోధనల్లో తేలింది. ఇండియన్ హార్ట్ సొసైటీ ప్రకారం..గుండెపోటు వచ్చిన 50 శాతం మగాళ్లలో 50 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వాళ్లే ఉన్నారు. విదేశీయులతో పోల్చితే మన దేశంలో ఉన్న మగాళ్లే రెండు రెట్లు ఎక్కువగా గుండె సంబంధిత జబ్బులతో బాధపడుతున్నారు.

- అనుపమ, క్లినికల్ సైకాలజిస్టు

అర్జీలను సకాలంలో పరిష్కరించండి

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 168 వినతులు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 168 వినతులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 109 ఉన్నాయి. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి సమస్యనూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జేసీ అధికారులను ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

పింఛను కోసం 8 నెలలుగా తిరుగుతున్నా..



'కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. షుగర్ వ్యాధితో రెండు కాళ్లు తొలగించారు. కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్నా. పింఛను కోసం ఎనిమిది నెలలుగా తిరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా పట్టించుకోండి' అంటూ రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన శంకరయ్య అధికారులకు విన్నవించారు.

నిమ్మచెట్లు నరికేశారు



అయ్యా నేను, నా భార్య దివ్యాంగులం. నాకు బాలయ్యపల్లి మండలం అష్టకావేరి గ్రామంలో ఎకరా భూమి ఉంది. 25ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాం. గ్రామానికి చెందిన వీరయ్య నా పొలాన్ని నాలుగు నెలల క్రితం ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే పొలంలో ఉన్న నిమ్మచెట్లను సదరు వ్యక్తులు నరికేశారు. న్యాయం చేయాలని వెంకటరమణయ్య అధికారులకు విన్నవించారు.

నష్ట పరిహారం ఇవ్వండి

గాలేరు - నగరి సుజల స్రవంతి పథకం కోసం ఏర్పేడు వద్ద ఉన్న మా భూమిని అధికారులు తీసుకున్నారు. పరిహారం కోసం మూడేళ్లుగా జీఎన్ఎస్ఎస్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా చెల్లించడంలేదు. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అదే పరిస్థితి. న్యాయం చేయాలని తిరుపతికి చెందిన మొబీనాబేగం అధికారులకు విన్నవించారు.

జీవో అమలు చేయాలని ఆందోళన

ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వంతో కుదుర్చుకున్న జీవోను తక్షణం అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై చర్చలు జరిపి జీవో విడుదలై తొమ్మిది నెలలు కావస్తున్నా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శిలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించాలని, పనిభారం తగ్గించాలని, ఉద్యోగ విరమణ చెందిన వారికి బెనిఫిట్ స్కీమ్ కింద తక్షణమే రూ.60వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.





వేతనం పెంచాలని ధర్నా

కనీస వేతనాలు పెంచాలని కోరుతూ సివిల్ సప్లైస్ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. సంఘీభావం ప్రకటించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు. ప్రతినెలా ఐదో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నగర కార్యదర్శి రవి, హమాలీ యూనియన్ నాయకులు చెంచయ్య, శీను, పాండు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం





ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనం - ప్రసాద్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని బియ్యం లారీ ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని వీఎంపల్లి వద్ద నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. వెంకటగిరి మండలం చిన్నపరెడ్డిపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి(37) ఎరువుల కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై సోమవారం సాయంత్రం శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఓ ఎరువుల దుకాణం వద్దకు వచ్చాడు. అక్కడ కార్యకలాపాలు ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. కాసాగార్డెన్ వద్ద సర్వీసు రోడ్డు నుంచి వెంకటగిరికి బయలుదేరాడు. వీఎంపల్లి వద్ద జాతీయ రహదారి మెయిన్‌రోడ్డులోకి ప్రవేశించే క్రమంలో నెల్లూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న బియ్యంలోడ్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా 90 రోజుల సుదీర్ఘకాలం ప్రసాద్‌రెడ్డి అయ్యప్పదీక్షలో ఉన్నాడు.

రేణిగుంటలో నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లు, రెండు మెడికల్ షాపుల సీజ్



సాయినారాయణ ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రేణిగుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు ఆర్ఎంపీ క్లినిక్‌లను, రెండు మెడికల్ షాపులను జిల్లా వైద్యాధికారి శ్రీహరి సీజ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని వీబీఆర్ నర్సింగ్ కళాశాలలో కలుషిత ఆహారం తిని ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వారిని జిల్లా వైద్యాధికారి శ్రీహరి పరీక్షించారు. ఈ సందర్భంగా వీబీఆర్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రేణిగుంట పట్టణంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లపై ఫిర్యాదు రావడంతో ఆయన వాటని తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సాయి నారాయణ, కార్తికేయ, శ్రీపద్మావతి వెంకటేశ్వర, రూప క్లినిక్‌లను, సాయి నారాయణ, శ్రీపద్మావతి వెంకటేశ్వర క్లినిక్‌లకు అనుబంధంగా ఉన్న మెడికల్ షాప్‌లను సీజ్ చేశారు. మండలంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేయాలని వైద్యాధికారి చక్ర ప్రకాష్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు.

జగన్‌పై అసభ్యకరపోస్టులు పెట్టారు

● తిరుపతి పోలీసులకు భూమన, రోజా, నారాయణస్వామి ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీల మధ్య, కులాల మధ్య చిచ్చుపెడుతూ తమ నాయకుడు వైఎస్ జగన్‌పై అసభ్యరక పోస్టులు పెడుతున్న వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ మంత్రి రోజా, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరసింహులు ఫిర్యాదును పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారికి చెప్పారు. వైసీపీ నాయకులు కోరినట్లుగా ఫిర్యాదుకు రసీదు ఇచ్చారు. వైసీపీని భ్రష్టు పట్టించాలనే ఆలోచనతోనే తప్పుడు పోస్టులు పెడుతున్నారని భూమన కరుణాకరరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. తమ ఆత్మాభిమానం దెబ్బతీసేలా పోస్టులు పెట్టిన వారిపై తక్షణం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



తిరుపతి ఈస్ట్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

పోలీసులపై ప్రివిలేజ్ మోషన్: ఎంపీ

ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు తీసుకోవడానికి పోలీసులు ఆసక్తి చూపలేదని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆరోపించారు. దాదాపు 40 నిమిషాల పాటు పట్టించుకోలేదన్నారు. ప్రొటోకాల్ పాటించని పోలీసులపై ప్రివిలేజ్‌మోషన్ మూవ్ చేయాల్సి వుంటుందని హెచ్చరించారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

● జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి



సమావేశంలో పాల్గొన్న జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులతో ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యావంతులు మహిళల భద్రత పట్ల శ్రద్ధ చూపాలని, మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి స్పష్టం చేశారు. తిరుపతి ఐఐటీలో నీతి బోధ్ క్లబ్, నేషనల్ సర్వీస్ స్కీం సహకారంతో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్ మాట్లాడుతూ... సమాజాన్ని చైతన్యవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళల భద్రత పెంపొందించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ... ఇలాంటి కీలకమైన కార్యక్రమాన్ని నిర్వహించడంలో నీతిబోధ్ క్లబ్, ఎన్ఎస్ఎస్ టీంల సమష్టి కృషి ఉందన్నారు. మహిళల హక్కులు, ఆహార భద్రత, పౌష్టికాహారంపై విజయభారతి సయాని పలు సూచనలు చేశారు. మహిళల శ్రేయస్సు, సాధికారతకు ఆచరించాల్సిన విధివిధానాలపై ప్రసంగించారు. ఐఐటీలో విశిష్ట ఉపన్యాస కార్యక్రమం సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా నిర్వహించడం పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ అధికారులకు ఐఐటీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

పేర్నాడు రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పులికాట్ సరస్సులో పర్యావరణం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో సూళ్లూరుపేట మండలం పేర్నాడు రోడ్డుకు అటవీ అనుమతులు ఇవ్వడం లేదని ప్రభుత్వం కల్పించుకొని అనుమతులు ఇప్పించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీలో ప్రస్తావించారు. సోమవారం శాసనసభ జీరో అవర్‌లో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో వేనాడు-పేర్నాడు రోడ్డు సమస్యను ఆమె ప్రస్తావించారు. మూడు పంచాయతీల పరిధిలో 18 గ్రామాలు ఉన్నాయని సుమారు 5వేల మంది ఆయా గ్రామాల్లో జీవిస్తున్నార న్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు సరైన రోడ్డు వసతిని ఆ గ్రామాల్లో ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. సరస్సు కోసం వచ్చే వలస పక్షులు ఎంత ముఖ్యమో ఆయా గ్రామాల ప్రజలు కూడా అంతే ముఖ్యమని తెలియజేశారు. ఆ మేరకు ఆ రోడ్డు ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తున్న అటవీశాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు.

ఎర్రచందనం వాహన డ్రైవరు అరెస్టు

● టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం చింతలపాలెం చెక్ పోస్టు వద్ద పది నెలల కిందట టాస్క్‌ఫోర్సు కానిస్టేబుల్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు.. ఎర్రచందనం స్మగ్లింగ్ వాహన డ్రైవర్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఏర్పేడు సీఐ జయచంద్ర తెలిపిన ప్రకారం.. చింతలపాలెం చెక్‌పోస్టు వద్ద ఈ ఏడాది ఫిబ్రవరి 23న తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు పోలీసులు వాహనాలను తనిఖీ తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఎర్రచందనం తీసుకుని వస్తున్న కారును కానిస్టేబుళ్లు ఆపారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరుకు చెందిన వసంత్ ఎర్రచందనం వాహనం ఆపకుండా వేగంగా వచ్చి కానిస్టేబుల్ ప్రభాకరరావును ఢీకొట్టి పరారయ్యాడు. దీనిపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడైన వసంత్ కోసం గాలించిన పోలీసులు.. సోమవారం అరెస్టు చేశారు. అతడిని విచారించి ఈ కేసులో ప్రధాన స్మగ్లర్ ఎవరనే విషయాలు నమోదు చేసి రిమాండుకు తరలించామని ఏర్పేడు సీఐ జయచంద్ర చెప్పారు.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. సూర్యోదయానికి ముందే ఆలయం వద్ద భక్తుల సందడి అధికంగా కనిపించింది. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. రెండవ గేటు సమీపంలో భక్తులు కార్తీక సోమవారం సందర్భంగా విశేషంగా దీపారాధన సమర్పించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అధికారులు అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకున్నారు. రూ.50 శీఘ్ర దర్శనం 3,328, రూ.200 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,102 కలిపి మొత్తం 6,430 టిక్కెట్లు అమ్ముడైనట్లు అధికారులుపేర్కొన్నారు. మొత్తంగా 35వేలమంది భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

వేడుకగా అయ్యప్ప పూజ

సూళ్లూరుపేట, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాపూజీ వీధిలో సోమవారం అయ్యప్ప స్వామి పూజ ఘనంగా జరిగింది. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి కర్పూర హారతి, 18 పడికట్ల పూజ చేశారు.

పుత్తూరు వార్తలు

స్కూలు బస్సుల కండిషన్ తనిఖీ



స్కూలు బస్సును తనిఖీ చేస్తున్న ఎంవీఐ చంద్రశేఖర్

పుత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని పాఠశాల బస్సు ఢీకొని 30 మంది విద్యార్థులు ప్రాణాలతో బయటపడిన సంఘటన తలుచుకుంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. ఈ ఘటన రెండురోజుల క్రితం నాగలాపురం మండలం వెళ్లూరు వద్ద జరిగింది. పిచ్చాటూరులోని భారతి విద్యాలయానికి చెందిన బస్సులో 30 మంది విద్యార్థులు ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది. బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. ఈ నేపథ్యంలో సోమవారం పుత్తూరు ఎంవీఐ చంద్రశేఖర్ పాఠశాల బస్సులను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రవాణాశాఖ నిబంధనలకు అనుగుణంగా బస్సులో ఏర్పాట్లను పరిశీలించారు. పుత్తూరు పరిధిలో 234 స్కూలు బస్సులు ఉండగా దాదాపు 60కి పైగా 10 సంవత్సరాలు పైబడిన వాహనాలున్నట్లు గుర్తించారు. కొన్ని విద్యాసంస్థల యాజమాన్యం బస్సుల కండిషన్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రమాదం జరగకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. డ్రైవర్లు కూడా వాహన కండిషన్ గురించి ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. పరిమితికి మించి విద్యార్థులను తరలించరాదన్నారు. పాఠశాల బస్సుల కండిషన్ పరిశీలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మొత్తం 24 బస్సులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభికి శుభాకాంక్షలు



పుత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాంకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. గత ప్రభుత్వ ఆరాచారానికి ఎదురొడ్డి పోరాటం సాగించిన యోధుడని కొనియాడారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



పుత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పుత్తూరు గేట్ మసీద్ వద్ద చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది. సోమవారం మసీదు వద్ద మైనార్టీ సోదరులు స్వచ్ఛందంగా తరలివచ్చి రుసుం కట్టి సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమనడానికి బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమన్నారు. నియోజకవర్గ పరిధిలో మైనార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గేట్ మసీద్ ఏ ముఖద్దస్ ముతవల్లి మహమ్మద్ గౌస్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫి అహమ్మద్, చిత్తూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కె.షబ్బర్, తెలుగుయువత నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి హమీద్ బాషా, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ రఫి, చాను, యూనస్, రసూల్, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ అతిథి గృహ మరమ్మతులకు రూ.10 లక్షలు



అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న గంజి మాధవయ్య, ఎంపీడీవో రమేష్

పుత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా శిథిలావస్థలకు చేరుకున్న పంచాయతీరాజ్ అతిథి గృహ మరమ్మతులకు ఎట్టకేటకు ఎమ్మెల్యే భానుప్రకాష్ చొరవతో మోక్షం లభించింది. ఇందుకు జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. మరో రెండు మూడు నెలల్లో అతిథి గృహం అన్ని హంగులతో అందుబాటులోకి రానుందని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య పేర్కొన్నారు. సోమవారం పుత్తూరు పట్టణ పరిధిలోని అతిథి గృహాన్ని ఎంపీడీవో రమేష్‌తో కలిసి పరిశీలించారు.

వేపగుంటలో గంజాయి బ్యాచ్ హల్‌చల్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

పుత్తూరు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వేపగుంటలో ఆదివారం రాత్రి గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేసింది. దీనిపై గ్రామస్తులు సోమవారం పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి గ్రామంలోని యతిరాజులు ఇంటికి వచ్చిన నంద, తిరుమల, దీపు, నితిన్‌తో పాటు మరికొందరు అల్లరిమూకలు మహిళలను దూషిస్తూ వీరంగం సృష్టించారు. రాళ్లు, కర్రలతో దాడికి యత్నించారు. ఈ క్రమంలో అల్లరిమూకలను నిలువరించే ప్రయత్నం చేసిన గ్రామస్తులపై కూడా వారు తెగబడ్డారు. గంజాయి మత్తులో జోగుతున్న యువతను అదుపు చేయలేకపోయారు. దాదాపు గంట పాటు హల్‌చల్ చేశారు. గ్రామంలో తాగునీటి ప్లాంట్‌తో పాటు పలు ప్రాంతాల్లో మద్యం తాగుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ ఓబయ్య విచారించి ఆకతాయిలను అరెస్టు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వండి

పుత్తూరు టౌన్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని, అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, టీకేఎంయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలం పేదలకు నివాసానికి సరిపోదన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



పుత్తూరు టౌన్, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో కార్తీక సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు దీపాలను వెలిగించారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



వడమాలపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానీ శంకర ఆలయ 11 వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహాశివుడికి శాస్త్రోక్తంగా చండీ హోమం, రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్ర గమకాలు పఠిస్తూ విశేష ద్రవ్యాలు, బిల్వ పత్రాలతో స్వామివారిని అభిషేకిస్తూ రుద్రాభిషేకం చేశారు. మహాశివుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అర్చకులు, శివ, సాయిల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో మహా చండీయాగం నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఊంజల సేవ నిర్వహించారు. మహిళలు భక్తిప్రపత్తులతో సహస్రనామార్చన, కుంకుమార్చన చేశారు.

రౌడీ మూకలతో భూకబ్జా యత్నం

అడ్డుకున్న పోలీసులు

వడమాలపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమండ్యం గ్రామంలో గోడౌన్ యాజమాని తనపై దౌర్జన్యం చేస్తూ తన పొలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని రోసిరెడ్డి ఆరోపించారు. తన పొలంలో ఉన్న తైలం చెట్లను నరుకుతుండగా సోమవారం తిరుపతి నుంచి 10 మంది యువకులు వచ్చి దౌర్జన్యం చేశారని, ట్రాక్టర్‌ను పెట్రోల్ పోసి తగుల బెట్టేస్తామని బెదిరించడంతో గ్రామస్తులు వడమాలపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకులను అక్కడి నుంచి తరిమివేశారు. గోడౌన్ యజమానికి ఫోన్ చేసి రికార్డులుంటే తీసుకుని రావాలన్నారు. రెండ్రోజుల్లో రికార్డులు చూపిస్తానని ఆయన పోలీసులకు చెప్పాడు.

హామీలు నెరవేర్చాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

వెంకటగిరిటౌన్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి పీ.బాలకృష్ణ అన్నారు. సోమవారం 3,5,8 సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వమే సొంతంగా ఇళ్లు కట్టిస్తామని చెప్పారని అది నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకయ్య, తులసమ్మ, జయకృష్ణ, అజయ్, సాయి, తిరుమలేష్, సౌరవ్, లోకేష్, గిరి, సరేంద్ర, సాయి పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌పై అవగాహన పెంచాలి

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత రబీసీజన్‌లో రైతులకు ఈ-క్రాప్‌పై అవగాహన పెంచాలని మండల వ్యవసాయ అధికారి వంజివాక నిరంజన్‌కుమార్ కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ సహాయకులతో ఈ క్రాప్‌పై సమీక్ష జరిగింది. పంటల వారీగా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి సాయికుమార్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మృతుడి వివరాలు లభ్యం

వాకాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ దర్గా సమీపంలో శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గుర్తుతెలియని యువకుడి వివరాలు సోమవారం వెల్లడయ్యాయి. ఎస్ఐ నాగబాబు కథనం మేరకు.. మృతుడు గూడూరు శివాలయం వీధిలోని కొండా ఉదయ్‌కుమార్‌రెడ్డి-కుసుమ దంపతుల కుమారుడు అనిత్‌రెడ్డి (25)గా గుర్తించారు. కాగా తమ కుమారుడి మృతిపై అనుమానం ఉందని సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని మృతుడి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న బిందురెడ్డి

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టత కోసం సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బిందురెడ్డి కోరారు. కోటలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆపార్టీ కార్యకర్తలు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. మండల కమిటీని వేయాలంటే క్రియాశీలక సభ్యత్వాల సంఖ్య పెంచాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి కోటారెడ్డి, శ్యామలమ్మ, వాసు తదితరులు ఉన్నారు.

గూడలిలో క్యాన్సర్ పరీక్షలు



కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గూడలి, రాజు పాళెం, దక్షిణపాలెం, ప్రకాశంకాలనీలలో సోమవారం వైద్య సిబ్బంది ఆధ్వ ర్యంలో క్యాన్సర్ పరీక్షలు జరిగాయి. ఏఎన్ఎం, ఆశాలు ఇంటింటా తిరిగి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. రక్తనమూనాలను సేకరించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

నాయుడుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ సీఐ అరుణకుమారి స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట - మేనకూరు సమీపంలో సోమవారం అదే గ్రామానికి చెందిన మహేష్ అనే యువకుడు అక్రమంగా 15 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా సీఐ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ వెంట ఎస్ఐ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

కొళాయిలు లేక..నీరంతా వృథా..!



కాశీపేట పాతమురళీకృష్ణ హోటల్ ఎదురుగా వృథాగా పోతున్న నీరు

వెంకటగిరిటౌన్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో నీరు వృథాగా పోతోంది. మున్సిపాలిటీ వారు తాగునీటి పైపులైన్లు వేశారు. అయితే ఆ పైపులకు కొళాయిలు ఏర్పాటుచేయలేదు. ఫలితంగా నీరు సరఫరా చేశాక ప్రజలు పట్టుకుంటున్నారు. కొళాయిలు లేకపోవడంతో ఆ తర్వాత నీరంతా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి కొళాయిలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

వెంకటగిరిటౌన్, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీ విశ్వనాధ స్వామి, రామలింగేశ్వర స్వామి, కర్లకమ్మ వీధిలోని హర హరక్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద మల్లికార్జున భ్రమరాంబిక ఆలయంలో కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకుని ఆలయాలు మహిళలతో కిక్కిరిసి శాయి. ఉదయం నుంచి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. ● అదేవిధంగా హర హర క్షేత్రంలో వైసీపీ పట్టణ కన్వీనర్ ఆధ్వర్యంలో డిల్లీబాబు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు.

గుంతలమయంగా ఏర్పేడు-పెంచలకోన హైవే

- రోడ్డును ఆక్రమించేసిన వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



వెంకటగిరి-రాపూరు దెబ్బతిన్న రోడ్డు

వెంకటగిరిటౌన్, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు పెంచలకోన జాతీయ రహదారి నెం. 565. ఇది ఏర్పేడు- పెంచల కోన వరకు 86 కిలో మీటర్లు ఉంది. ఈ జాతీయ రహదారిని 2017లో ప్రారంభించారు. ఈ రహదారిలో చింతలపాళెం, గుండవోలు వద్ద రెండు టోల్ గేట్లు ఉన్నాయి. రెండు చోట్లా వాహనదారుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారు. అయితే ఈ జాతీయ రహదారి పొడవునా గుంతలమయంగా దర్శనం ఇస్తుంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పశువులతో ప్రమాదాలు.. కుచించుకుపోయిన రోడ్డు

హైవే వెంబడి ఉన్న గ్రామాల్లో పశువులు రోడ్డుపై వదిలి వేస్తున్నారు. ముఖ్యంగా పాలకేంద్రం, వల్లివేడు క్రాస్, కాంపాళెం, మిట్టపాళెం, నాగవోలు, వడ్డిపల్లి, పలుగోడు పశువులు రోడ్డుపై ఉంటు న్నాయి. అవిరోడ్డు వెంబడి మేత మేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో అవి పోట్లాడుకుని అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. ఆ సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు ఉంటున్నాయి. వాటిని కత్తిరించడం లేదు. ఇక రోడ్డుపై సాగించే వ్యాపారులతోనూ వాహనదారులు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధానంగా రాపూరు క్రాస్ రోడ్డు నుంచి పాలకేంద్రం వరకు 80 అడుగుల రోడ్డు విస్తీర్ణం ఉంది. పాలకేంద్రం నుంచి తారక రామారావు స్టేడియం వరకు 50 అడుగుల రోడ్డుకు పడిపోయింది. దాదాపు 30 అడుగుల రోడ్డును వ్యాపారులు ఆక్రమించేశారు. రోడ్డు ఇరుకైపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

దుగరాజపట్నం ఓడరేవుతో అభివృద్ధి



సూళ్లూరుపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న చింతామోహన్, కాంగ్రెస్ నాయకులు శివ

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దుగరాజపట్నంలో ఓడ రేవు ఏర్పాటు అయితే మారు మూలపల్లెలు సైతం అభివృద్ధి చెందుతాయని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. కోట పట్టణంలో సోమవారం దుగరాజ పట్నం ఓడరేవు కావాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ దుగరాజపట్నం ఓడరేవు వల్ల కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలలో వేలాది మంది నిరుద్యోగులకు జీవనోపాధి లభిస్తుందన్నారు.

సూళ్లూరుపేట: దుగరాజపట్నం పోర్టు పనులు వెంటనే ప్రారంభించాలని చింతామోహన్ కోరారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద దుగరాజ పట్నం పోర్టు పనులు ప్రారంభించాలని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దుగరాజ పట్నం పోర్టుపై నిర్లక్ష్యం చేస్తూ ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ పాల్గొన్నారు.

రామాపురంలో ఆర్టీసీ బస్సుల స్టాపింగ్

తడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఆర్టీసీ బస్సులు నిలిచేలా చర్యలు తీసుకున్నామని సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున తెలిపారు. కొద్దిరోజుల క్రితం రామాపురానికి వచ్చిన కలెక్టర్ వెంకటేశ్వర్‌కు బస్సు వసతి కల్పించాలంటూ గ్రామస్తులు విన్నవించుకున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ అప్పట్లో ఆయన ఆదేశాలు ఇచ్చారు. ఆ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట ఆర్టీసీ అధికారులు రామాపురంలో సోమవారం బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. చెన్నై సర్వీసులు ఆగుతాయని ఆ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మల్లికార్జున తెలిపారు. యూనియన్ నాయకులు శేఖర్ ఉన్నారు.

అన్ని సమస్యలూ పరిష్కరిస్తాం: కమిషనర్



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ కాటయ్య, కసారెడ్డిపాలెం వాసులు

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అన్ని అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య అన్నారు. సోమవారం సూళ్లూరుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మున్సిపాలిటీ కార్యాలయం చుట్టూ నివాసాలు ఉండే ప్రజలు కార్యాలయం చుట్టూ ఉండే నాలుగు వైపులా రోడ్డులో చిన్నపాటి వర్షమొచ్చినా మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే కసారెడ్డిపాలెం చెరువు ఆక్రమణకు గురవు తోందని మురుగు నీరంతా చెరువులో కలుస్తోందని మాజీ కౌన్సిలర్ పొన్నా కాటయ్యతో కలిసి ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు వినతి పత్రం అందజేశారు. మొత్తం వివిధ సమస్యలపై 19 అర్జీలు వచ్చాయని అన్నింటినీ పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి: సీపీఐ



దేగలపాలెం సచివాలయంలో అర్జీ వస్తున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోదుగుల పార్థసారధి కోరారు. సోమవారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి కోళ్లమిట్ట, ఇసుకమిట్ట, మన్నారుపోలూరు, దేగలపాలెం, మన్నారుపోలూరు సచివాలయాలతో పాటు మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆనంద్ బాబు, సీపీఐ నాయకులు మోదుగుల రమణయ్య, బాలయ్య, లక్ష్మి, అశోక్‌బాబు, మీరా పాల్గొన్నారు.

పుస్తకం మనిషికి మంచి మిత్రుడు

షార్‌లో ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్, పక్కనే ఐఐటీ తిరుపతి డిప్యూటీ లైబ్రేరియన్ ప్రశాంత కుమార్, షార్ కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్

సూళ్లూరుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుస్తకం మనిషికి మంచి మిత్రుడితో సమానమని ఐఐటీ తిరుపతి గ్రంథాలయ సహాయకులు ప్రశాంత కుమార్ బెహరా పేర్కొన్నారు. సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో సోమవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాలను పురస్కరించుకొని షార్‌లోని బ్రహ్మ ప్రకాష్ లో హాలులో నిర్వహించిన పుస్తక ప్రదర్శనను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ రంగనాథన్ భారత లైబ్రరీ సైన్సు పితామహుడిగా పరిగణించారని ఆయన రచనలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రభావం చూపాయన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రశాంత కుమార్ బెహరా మాట్లాడుతూ మానవ జీవితంలో గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసుల రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, ఎంఎస్ఏ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక వెలుగులు



సోమేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల శివాలయాలలో సోమవారం కార్తీకమాస పూజలు జరిగాయి. గూడలిలోని కామాక్షిదేవి సమేత సంఘమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేసి రుద్రాభిషేకం నిర్వహించారు. కామాక్షిదేవి సమేత సోమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అదే విధంగా సోమేశ్వరుడు, కామాక్షిదేవి అమ్మవార్లను ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మూడవ సోమవారం పట్టణంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సంఘమేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు కార్తీకదీపాలను వెలిగించారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ కోసం రిజిస్టర్ చేసుకోండి

పుత్తూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతీయువకులకు వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. టెన్త్ ఆపైన విద్యార్హతలున్న ఔత్సాహికులు స్కిల్ హబ్ కేంద్రంలో ఆధార్ కార్డు, మార్కుల జాబితాతో ఈనెల 21వ తేదీ లోగా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం నెం.6300954441లో సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు పోటీలు

పుత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని ఐదు పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల మీద విద్యార్థులకు వ్యాస రచనల సహా పలు రకాల పోటీలను నిర్వహించామని పుత్తూరు గ్రంథాలయాధికారి మీనాకుమారి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు వారోత్సవాలలో చివరి రోజున బహుమతులు అందిస్తామన్నారు.

టీడీపీలో చేరుదాం... అభివృద్ధిలో భాగమవుదాం

బాలాయపల్లి, నవంబరు 18,(ఆంధ్రజ్యోతి): టీడీపీలో చేరుదాం.. ఏపీ అభివృద్ధిలో భాగమవుదామని కార్యక్రమాన్ని ఐ టీడీపీ అధ్యక్షులు గూతు ప్రసన్న కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కడగుంట గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రూ.100 సభ్యత్వ రుసుముతో రూ.5లక్షలు ప్రమాద బీమా కల్పించి కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని ఆయన తెలియజేశారు.

టీచర్‌ను నియమించండి

చిల్లకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేటలోని ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడుని నియమించాలని సోమవారం ఎస్ఎంసీ సభ్యులు, తల్లి దండ్రులు ఎంఈవో సనత్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో 81మంది విద్యార్థులు ఉన్నార న్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులు ఉండగా ఒకరిని వేరే పాఠశాలకు పంపారన్నారు. ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారన్నారు. మిలిగిన ఇద్దరు సిలబస్ పూర్తిచేయలేక, సరైన బోధన అందించలేక పోతున్నారు. విద్యార్థులు చదువులో వెనబడుతున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

సాదర వీడ్కోలు



తిరుపతి విమానాశ్రయంలో చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నేత ఇందుశేఖర్

ఆరు గ్రావెల్ టిప్పర్ల స్వాధీనం



సత్యవేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఆరు టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. స్థానిక వీఆర్‌కండ్రిగ సమీపంలోని ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో వీఆర్వో వినోద్, ఆర్ఐ సురేష్ ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. ఈ దాడులలో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నారని గుర్తించి సంబంధిత టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్లను ఆర్‌టీసీ డిపో ప్రాంగణంకు తరలించి, జిల్లా మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు.

కాజ్‌వేలకు మరమ్మతులు చేపట్టండి: బీజేపీ

వరదయ్యపాళెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలం కదూరు వద్ద ఉన్న అరుణానది వంతెన, గోవర్ధనపురం వద్ద ఉన్న కాజ్‌వే మరమ్మతలను వెంటనే చేపట్టాలని బీజేపీ నాయకుడు దిలీప్‌రాయల్ కలెక్టరేట్ అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. కాజ్‌వేలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అరుణానది వంతెన మీదుగా చెన్నై, సత్యవేడులకు బస్సులు నడుతుపుతుంటారన్నారు. అంతేకాకుండా కంకరలోడ్ టిప్పర్లు, శ్రీసిటికి వెళ్లే బస్సులు ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటాయన్నారు. ఈ వంతెనలు ఎపుడు కూలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారని వెంటనే మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు.

గౌడ సంక్షేమ సంఘం చైర్మన్‌కు సన్మానం

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి గౌడ సంక్షేమ సంఘం చైర్మన్‌గా పర్వతాల చంద్రశేఖర్ గౌడ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక బాలాజీ తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షుడు శేషం చెంగలరాయలుగౌడ్, అధ్యక్షుడు రాజశేఖరగౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం చంద్రశేఖరగౌడ్‌ను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమలో మోహన్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, పురుషోత్తంగౌడ్, భక్తి కృష్ణయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోండి: ఎస్‌ఎంసీ చైర్మన్

పిచ్చాటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులియంగుంట జడ్పీ హైస్కూలు హెచ్‌ఎం రామ్మూర్తి విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో పాటు ఎస్‌ఎంసీని నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ పరంధామ ఆచారి పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎస్‌ఎంసీ సభ్యులతో పాటు గ్రామస్తులతో పాఠశాలను తనిఖీ చేయగా హెచ్‌ఎం లేకపోవడాన్ని గుర్తించామన్నారు. హెచ్‌ఎం మొబైల్‌కు ఫోన్ చేయగా తాను సెలవులో ఉన్నానని సమాధానం చెప్పారన్నారు. ఎస్‌ఎంసీ కమిటీ ఏర్పాటు చేసి మూడు నెలలు కావస్తున్నా మధ్యాహ్న భోజన కార్మికులకు బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయలేదన్నారు. వాచ్‌మెన్ పేరున కూడా అకౌంట్ ఓపెన్ చేయలేదన్నారు. గతంలో ఎంఈవోకు హెచ్‌ఎంపై ఫిర్యాదు చేయగా తన కేడర్, అతని కేడర్ ఒకటేనని తనకు చెప్పినట్టు చైర్మన్ వాపోయారు. ఇప్పటికైనా ఈ ప్రధానోపాధ్యాయుడిపై జిల్లా విద్యాధికారి తగిన చర్యలు తీసుకోకుంటే విద్యార్థులతో కలసి ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సత్యవేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆత్మ కార్యాలయం ఆవరణలో ఏవో మురళి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. మండలానికి 1694 రకం విత్తనాలు 360 క్వింటాళ్లు, కే6 రకం 140 క్వింటాళ్లు వచ్చాయని తెలిపారు. ఒక రైతుకు పట్టాదారు పాసు పుస్తకంపై గరిష్ఠంగా మూడు బస్తాలను ఇస్తామన్నారు. 30 కిలోల బస్తా రూ.1728 అన్నారు. సుందరరామిరెడ్డి, మస్తాన్, పరమశివం, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలకు విశేష స్పందన

సత్యవేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలోని సత్యవేడు -3వ సచివాలయంలో సోమవారం పింక్ బస్సు ద్వారా నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలకు విశేష స్పందన లభించింది. స్విమ్స్ శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో జిల్లాలో పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పింక్ బస్సులో నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్, స్విమ్స్ క్యాన్సర్ యూనిట్ పీఆర్వో చంద్రమోహన్ పర్యవేక్షణలో క్యాన్సర్ వైద్య నిపుణులు చైతన్యభాను, హరిత బృందం పరీక్షలు నిర్వహించింది. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, సర్పంచ్ మంజుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కైలాసకోనలో కార్తీక దీపోత్సవం



నారాయణవనం, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని కైలాసకోనలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, కామాక్షి దేవి సమేత కైలాసనాథుడిని దర్శించుకున్నారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించి, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో స్వామివారిని, అమ్మవారిని అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలో బియ్యపు పిండితో చేసిన నేతి దీపాలు వెలిగించారు. పిచ్చాటూరు మండలంలోని రామగిరి వాలీశ్వరాలయంలో సోమవారం కార్తీక దీపోత్సవం మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. మండలంలోని రాజులపాళెం వద్ద నడిచి వెళుతున్న మహిళను శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుశీలమ్మకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం ఏర్పేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.

ముక్కంటి సేవలో రైల్వే ఐజీ



శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం రైల్వే ఐజీ ఈశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నగరోత్సవం



శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి నగరోత్సవం వైభవంగా జరిగింది. కార్తీకమాసం సోమవారం సందర్భంగా రాత్రి ఊరేగింపు జరిగింది. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాల సమర్పణ అనంతరం చతుర్మాడ వీధుల్లో స్వామి అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు కర్పూర హారతలు, కొబ్బరికాయలు సమర్పించారు.

చక్రేశ్వరస్వామికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడి వీధిలో కొలువై ఉన్న చక్రేశ్వరస్వామికి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు చేసి అనంతరం ప్రత్యేకంగా అలంకరిం చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

త్వరలోనే భూ సమస్యల పరిష్కరిస్తాం

కేవీబీపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు పరిష్కారం చూపిస్తామని గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన అర్జీదారులతో తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు. ఓళూరు, ఆదవరం, కేవీబీపురం, రాజులకండ్రిగ తదితర గ్రామాలనుంచి భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి రీసర్వే జరుగోతందని అనంతరం ఎవరి భూములు ఆక్రమణకు గురయ్యాయో తెలుస్తుందన్నారు.

ఘనంగా బాలల హక్కుల వారోత్సవాలు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కోఆర్డినేటర్ సుభాష్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థురాలికి ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌డీకేనగర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, లలిత దంపతుల కుమార్తె యామిని కిడ్నీవ్యాధితో బాధపడుతోంది. నిరంతరం డయాలసిస్ చేసుకోవాల్సిన పరిస్థితి. యామిని తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత లేకపోవడంతో పట్టణానికి చెందిన లూథరన్ చర్చి మాజీ వైస్ చైర్మన్ కన్నలి రమేష్ సోమవారం రూ.7వేలు అందజేశారు.

తహసీల్దార్ కార్యాలయ రికార్డులు తడిచిపోతున్నాయి

వరదయ్యపాళెం తహసీల్దారు కార్యాలయం ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉరుస్తోంది. పైకప్పు పెచ్చులూడుతోంది. దీంతో రికార్డులు తడసిపోతున్నాయి. రికార్డులను ఎక్కడ భద్రపరచాలో అధికారులకు దిక్కుతోచడం లేదు. ఉన్నతాధి కారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి




పెచ్చులూడుతున్న తహసీల్దారు కార్యాలయం - చెమ్మతో చిలుము పడుతున్న బీరువాలు

భరద్వాజ తీర్థంలో వేడుకగా లక్ష దీపోత్సవం





భరద్వాజతీర్థంలో పూజలు చేస్తున్న ఈవో తదితరులు - కార్తీక దీపాల వెలుగులో భరద్వాజతీర్థం

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ అధికారులు ముందుగా భర ద్వాజతీర్థం చుట్టూ క్రమపద్ధతితో నేతి దీపాలను అలంకరించారు. పుష్కరిణి ప్రాంగణంలో ముందుగా స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి విశేష పూజలు చేసి హారతులు సమర్పించారు. అనంతరం లక్ష దీపోత్సవాన్ని ఈవో బాపిరెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ యేడాది తొలిసారిగా లక్ష దీపోత్సవాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఈ విశేష వేడుకను మొదట నారద పుష్కరిణిలో నిర్వహించారు. రెండో వారం వైష్ణవ కోనేరులో కొనసాగించారు. మూడో వారం భరద్వాజతీర్థంలో చేపట్టారు. ఈ విశేష వేడుకను మహిళలు భక్తి శ్రద్ధలతో వీక్షించారు. నేతి దీపకాంతులతో పుష్కరణి తేజోమయంగా ప్రజ్వల్లింది.

ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేయాలి: సీపీఐ



శ్రీకాళహస్తిలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల్ని అమలు చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. సోమవారం 18వ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే పట్టణ పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ పేదలకు మూడు సెంట్లు ఇస్తామని చెప్పా రన్నారు. దాన్నిఅమలు చేయాలని కోరారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ● వరదయ్యపాళెంలో సీపీఐ ఏరియా కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద ధర్నా జరిగింది. నాపా కృష్ణమూర్తి, నాగరాజు, రమేష్, రాజమ్మ, మురళి, నాగార్జున, ధనంజయులు, సిద్దులయ్య, తరుణ్‌కుమార్, బాలగురునాథం, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ● బుచ్చినాయుడుకండ్రిగ మండల సీపీఐ కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో వీఎస్‌పురం, బీఎన్ కండ్రిగ, కంచనపుత్తూరు, ఆర్ అనంతపురం సచివాలయాల వద్ద ధర్నాలు జరిగాయి. కత్తి రవి, వెంకటకృష్ణయ్య, భాస్కర్, మారయ్య, వెంకటయ్య, చంద్రమ్మ, చొక్కలింగం, తదితరులు పాల్గొన్నారు. ● పిచ్చాటూరు మండలంలోని సచివాలయాల సీపీఐ నాయకులు అన్నాదొరై, గురుమూర్తి, ఆనంద్ జ్యోతి, శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో ధర్నాలు జరిగాయి.

సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలుద్దాం: సుధీర్



సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తి నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సుధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం సభ్యత్వ నమోదు ప్రక్రియపై టీడీపీ శ్రేణులకు ఆయన పలు సూచనలు చేశారు. పేదలకు సభ్యత్వ నమోదు ద్వారా కలిగు ఉపయోగాల్ని వివరించాలని దిశానిర్దేశం చేశారు. టీడీపీ కుటుంబ సభ్యులంతా క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా సభ్యత్వ నమోదును కొనసాగించాలని సూచించారు. అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన కార్యకర్తలకు తగిన ప్రోత్సాహకం ఇస్తామని భరోసా ఇచ్చారు. చెంచయ్యనాయుడు, మిన్నల రవి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరానికి పయనమైన సీఎం



రేణిగుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సోదరుడి అంత్యక్రియలకు నారావారిపల్లెకు హాజరైన సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరానికి బయలుదేరి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం నారావారిపల్లి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న సీఎంకు శ్రీకాళహస్తి, చంద్రగిరి, పలమనేరు ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, నాని, అమరనాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఐజీ బాజ్‌పాయ్, జేసీ శుభం భన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు సాదర వీడ్కోలు పలికారు. అలాగే మంత్రి లోకేశ్ సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ మరో ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

కళత్తూరు దళితుల భూముల్లో రీసర్వే

కేవీబీపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల కళత్తూరు దళిత రైతులకు, అటవీ శాఖ అధికారుల నడుమ భూ వివాదాన్ని దృష్టిలో పెట్టుకుని సోమవారం రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. ప్రస్తుతానికి రోడ్డు పక్కనే ఉన్న భూములను రీసర్వే చేశారు. అటవీ భూములు తర్వాత సర్వే చేస్తామని సర్వేయర్ సురేష్ తెలిపారు. బీట్ ఆఫీసర్ లోకనాథం పాల్గొన్నారు.

మిన్నల రవికి సన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 18: వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మిన్నల రవికి సోమవారం ఘనసన్మానం జరిగింది. వన్నెరెడ్డి జాగృతి సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎం.మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ మిన్నల రవికి డైరెక్టర్ పదవి రావడం సంతోషకరమన్నారు. సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి రెడ్డి, చంద్రారెడ్డి, గజేంద్రరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 26మంది ఎంపిక



శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ, సీడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పలు బహుళ జాతి పరిశ్రమ నిర్వాహకులు ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 26మంది ఎంపిక కాగా 14మంది మహిళా డిగ్రీ కళాశాల నుంచి, 12మంది వివిధ కళాశాలల నుంచి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. జేకేసీ కోఆర్డినేటర్ ఉషారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఎం కుసుమ్‌పై అవగాహన

రేణిగుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పీఎం కుసుమ్ పథకంపై రైతులకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో అవగాహన కల్పించారు. చైతన్యపురంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన రైతులకు వ్యవసాయ రంగంలో వినియోగించే నూతన పరికరాలు తదితరాలను వివరించారు.

అమృత్ నిధుల మళ్లింపుపై నిరసన



పురపాలకసంఘ ఆవరణలో నిరసనలో బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన అమృత్ నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించడంపై బీజేపీ నాయకుడు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పురపాలకసంఘ కమిషనర్ గిరికుమార్‌ను కలిసి పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ కొందరు అధికారులు ఇంకా వైసీపీ ప్రభుత్వం ఉందనే ఆలోచనలో ఉన్నారన్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి అమృత్ పథకం అర్హత లేకున్నా అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు మంజూరు చేశారన్నారు. అందుకు సంబంధించిన వివరాలను తమకు రాత పూర్వకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాల్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విభజించి పాలించడం సరికాదు

మాజీ ఎంపీ చింతామోహన్

వరదయ్యపాళెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీలను విభజించి పాలించడం సరికాదని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. దళితులను విభజిస్తే చంద్రబాబు పతనం ప్రారంభమవుతుందన్నారు. దుగరాజ పట్నంపోర్టు, మన్నవరం పరిశ్రమలను ప్రారంభించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం వరదయ్యపాళెం మాజీ ఎంపీపీ విక్రమార్కరెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఆయనకు చింతామోహన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శివ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద ఈనెల 26న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామిశెట్టి వెంకయ్య పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం చిందేపల్లిలో సోమవారం మహాధర్నా కరపత్రాలను రైతుల సమక్షంలో ఆవిష్కరించారు. దశరథరామయ్య, మహానందరెడ్డి, మోహన్‌రెడ్డి, రఘురామయ్య, వీరరాఘవయ్య మాతయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లంలో కార్తీక దీపోత్సవం



నెల్లిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

ఏర్పేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆల యంలో సోమవారం కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల అభిషేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి, వేదపండితులు పవన్ శర్మ, వంశీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వరదయ్యపాళెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉబ్బలమడుగులో సమీపంలో ఉన్న సిద్దులయ్యకోనలో వెలసిన సిద్దేశ్వరస్వామికి కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సురుటుపల్లిలో కార్తీక శోభ



నేతి దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు

నాగలాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూల దేవతామూర్తులు వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్లకు అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణలోని రావి చెట్టు ఎదుట నేతి దీపాలు వెలిగించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లతా పర్యవేక్షించారు.

తిరుమంజనాది ఉపచార పూజలు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

వరదయ్యపాళెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాండూరు పంచాయతీ వడ్డిపాళెంలో భూమి, నీలాదేవి సమేత శ్రీనివాస్వామి ఆలయంలో సోమవారం తిరుమంజనాది ఉపచార పూజలు జరిగాయి. సాయంత్రం వసంతోత్సవం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.